ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 22 మార్చి 2024





ఏనుమాముల మార్కెట్ సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద బారులు తీరిన మిర్చి వాహనాలు

ధరలేక దాచుకునే దారిలేక!

తనిఖీలు నిల్

మార్కెట్ పరిధిలో ఉన్న 25 కోల్డ్ స్టోరేజీల్లో అధికారులు తనిఖీ చేసి ఎంత సరుకు ఉంది. ఎంత ఖాళీ ఉంది. నిల్వ చేసిన సరుకులో అటు రైతులకు.. ఇటు వ్యాపారుల కు ఎవరికెంత అవకాశం కల్పిస్తున్నారని పరిశీలించిన దాఖలాలు లేవు. మార్కెట్ నుంచి ఎవరో సెక్యూరిటీ గార్డునో, డీఈవోనో, సూపర్‌వైజర్‌నో పంపిస్తే కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు అప్పటికే తయారు చేసిన స్టాక్ పట్టికను ఇచ్చి పంపిస్తారు. దీంతో రైతులకు అన్యాయం జరుగుతుందని రైతు సంఘాలు వాపోతున్నాయి. ఇక ఇందులోనే వ్యాపారులు వేర్వేరు పేర్లతో బుకింగ్‌లు చేసుకుని.. పరస్పరం సహకరించుకుంటారు. ఏనుమాముల మార్కెట్లో మిర్చి వ్యాపారం చేసే వారిలో కొందరికి సొంత కోల్డ్ స్టోరేజీలున్నాయి. వాళ్లు కొనుగోలు చేసిన పంటను ఆ కోల్డ్ స్టోరేజీల్లోనే నిల్వ చేసుకుంటారు. ఆ తరువాతే వేరేవారికి అవకాశం కల్పిస్తారు. ఈ నేపథ్యంలో నేరుగా రైతులు మిర్చి బస్తాలను నిల్వ చేసుకుందామని వెళితే స్టోరేజీ ముందు 'స్థలంలేదు' అని బోర్డులు కనిపిస్తుండటంతో లబోదిబోమంటున్నారు. ఇక పంట నిల్వ ఉండాలంటే ఏసీ సదుపాయం తప్పనిసరి కాగా.. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే అవకాశం లేక మార్కెట్లో వ్యాపారులు ఎంత ధర చెబితే అంతకు అమ్ముకుని ఇంటి దారి పడుతున్నారు.

దిగాలు చెందుతున్న మిర్చి రైతులు
అన్నదాతలకు తెరుచుకోని కోల్డ్ స్టోరేజీల ద్వారాలు
వ్యాపారుల వైపే శీతల గిడ్డంగుల నిర్వాహకుల మొగ్గు
ధరల కోసం వేచిచూడలేక పంటను తెగనమ్ముకుంటున్న రైతులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 21: చీడపీడలు, ప్రకృతి విపత్తులను తట్టుకుని మరీ ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు.. ఆ పంటలను అమ్ముకునే సమయంలోనూ కష్టాలు.. నష్టాలను ఎదుర్కోక తప్పడం లేదు. ముఖ్యంగా ప్రస్తుతం మిర్చి రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఓ వైపు ధర లేక.. మరో వైపు పంటను దాచుకునేందుకు కోల్డ్ స్టోరేజీల్లో అవకాశం లేక వారు దిగాలు చెందుతున్నారు. దీంతో మార్కెట్‌కు తెచ్చిన పంటను కష్టమో.. నష్టమో అని నిట్టూరుస్తూ వచ్చిన ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. అయితే పంటలు పాడైపోకుండా నిల్వ చేసుకునేందుకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల కింద కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. వాటిలో పంటల నిల్వలకు రైతులకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ, కొన్ని కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులు వ్యాపారులతో చేతులు కలిపి ముందస్తుగానే బుకింగ్‌లు చేసుకుని.. వారు రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటలను పెట్టుకుంటున్నారు. ఈక్రమంలో నేరుగా పంటను దాచుకునేందుకు వెళుతున్న రైతులకు అవకాశం దక్కడం లేదు. దీంతో పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతు.. ఆ బస్తాలను తిరిగి తీసుకువెళ్లలేక.. అక్కడే అమ్ముకోవాల్సిన పరిస్థితిఏర్పడుతోంది.ఇందుకు మార్కెట్లోని మిర్చి వ్యాపారులు కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులతో చేతులు కలిపి ముందుగానే కోల్డ్ స్టోరేజీలను ఆక్రమించడం, ఆ తర్వాత మార్కెట్‌లో ధరలు తగ్గిస్తుండడమే కారణంగా తెలుస్తోంది. మరోవైపు అంతర్జాతీయ ఎగుమతులను ప్రభుత్వం నిలిపేయడం కూడా ధరల పతనానికి కారణంగా చెబుతున్నారు. 2021-22లో మిర్చికి రైతులు ఆశించనదాని కంటే మూడింతలు ఎక్కువ రేటు పలుకడంతో 2022-23లో రైతులు మిర్చి సాగు అధికంగా చేశారు. వ్యాపారులు కొనుగోలు చేసిన మిర్చి అప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో 50 శాతం ఆక్రమించింది. 2023-24లో అదే స్థాయిలో సాగు చేశారు. ప్రస్తుతం మిర్చికొనేవాళ్లు తక్కువయ్యారు. అమ్మేవాళ్లు ఎక్కువయ్యారు. ఈ నేపథ్యంలో మిర్చి ధరలు రోజు రోజుకు పడిపోతున్నాయి.

మిర్చి ధరలు మరింత తగ్గే అవకాశం

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 25 కోల్డ్ స్టోరేజీలు ఉండగా.. 90 శాతం నిండిపోయాయి. మరో వారం రోజుల్లో ఆ పది శాతం కూడానిండిపోతుంది. ఈ తర్వాత మార్కెట్‌కు మిర్చి వచ్చినా వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపే అవకాశం లేదు. కొనుగోలు చేసిన మిర్చిని నిల్వ చేసుకునే సదుపాయం లేదు. వ్యాపారులకు ఎగుమతుల ఆర్డర్లు ఉంటేనో లేక మిర్చి పౌడర్ చేసి వ్యాపారం చేసే అవకాశం ఉంటేనో కొనుగోలు చేస్తారు. ఈ నేపథ్యంలో మిర్చి ధరలు మరింత తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

25కోల్డ్ స్టోరేజీలు..

మార్కెట్ పరిధిలో ఉన్న 25 కోల్డ్ స్టోరేజీల్లో 27 లక్షల బస్తాలను నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. గత సోమవారం నాటికి 23లక్షల బస్తాలు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ఇక మిగిలింది సుమారుగా నాలుగు లక్షల బస్తాలు అంటే మరో రెండు మూడు రోజుల్లో అది కూడా నిండిపోతుంది. దీంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉండదు. ఆ తరువాత మార్కెట్‌కు అమకానికి వచ్చిన మిర్చి పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వరంగల్ మార్కెట్లో పంటల ధరలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 21: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో గురువారం వివిధ పంట సరకులకు అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 800 బస్తాల పత్తి అమ్మకానికి వచ్చింది. ధర క్వింటా రూ.7,315 పలికింది. సింగిల్‌పట్టీ రకం మిర్చి క్వింటా రూ.45,600, తేజా మిర్చి రూ.19,300, వండర్‌హాట్ రకం రూ.15,500, యుఎస్341 రకం మిర్చికి రూ.16,500, దేశీ రకం రూ.34వేలు, తాలు రూ.8వేలు ధర పలికింది.



ఏనుమాముల మార్కెట్ సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద బారులు తీరిన మిర్చి లోడు వాహనాలు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నగరంలో నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 21: కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలు, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఎలాం టి అవాంతరాలు లేకుండా చూడాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమావేశమయ్యారు. సిబ్బం దికి పలు సూచనలు చేశారు. ఇంజనీరింగ్ సిబ్బంది ఆయా డివిజన్‌లలో ఉన్న పలు కాలనీలలో నీటి సమస్యాత్మక ప్రాం తాలను గుర్తించాలన్నారు. 66 డివిజన్‌లలో ప్రతీ డివిజన్‌కు సూక్ష్మ ప్రణాళిక (మైక్రోప్లాన్) తయారు చేయాలని సూచించారు. నీటి సమస్యకు పరిష్కార మార్గాలను సిద్ధం చేయాల ని అన్నారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. అదే విధంగా వేసవికాలంలో నీటి సమ స్యల అధికమవుతుందని, ఆయా కాలనీలలో ఎన్ని బోర్లు ఉన్నాయి? ఎన్ని పని చేస్తున్నాయి? ఎన్ని రిపేరు చేయాల్సి ఉంది? అని పూర్తి సమాచారం తీసుకోవాలని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి సమాచారం సేకరించి మర మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వాల్వుల పని తీరును పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, రాజయ్య డీఈలు సిరిమల్లె సారంగం, రవికుమార్, సంతోష్ బాబు, కృష్ణమూర్తి, రంగారావు, దేవానంద్‌లు పాల్గొన్నారు.

గందరగోళంలో 'గృహజ్యోతి' 7

కలెక్టర్‌ను కలిసిన ఐపీఎస్ అధికారి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 21: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అటాచ్‌మెంట్ అయిన 2020 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంకిత్ కుమార్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారికి కలెక్టర్ ప్రావీణ్య శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐపీఎస్ అధికారి అంకిత్ కుమార్

కులం పేరుతో దూషించిన ముగ్గురిపై కేసు

నల్లబెల్లి, మార్చి 21 : కులం పేరుతో దూషించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన నాగెల్లి సారయ్య జేసీబీ యంత్రంతో నల్లబెల్లి గ్రామ శివారు చెరువులో మట్టిని తరలిస్తున్నాడు. చెరువు మట్టిని తరలిస్తున్న వ్యక్తిని మంద రాజయ్య, జంగిలి రాజు, బుజ్జు ఐలయ్య పరుష పదజాలంతో, కులం పేరుతో దూషించారు. దీంతో నాగెల్లి సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పది ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21: పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గురువారం జరిగిన పరీక్షలో వరంగల్ జిల్లాలో 99.85 శాతం మంది విద్యార్థులు హాజరుకాగా, హనుమకొండ జిల్లాలో 99.89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్ జిల్లాలో 9,441 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 9,427 మంది హాజరుకాగా, 14 మంది గైర్హాజరయ్యారు. ఇక హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 11,992 మంది హాజరు కావాల్సి ఉండగా, 11,979 మంది హాజరుకాగా, 13 మంది గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లా పరిధిలోని రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించగా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఒక పరీక్షా కేంద్రాన్ని సందర్శించగా, డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై, ఏసీజీఈ డి.చలపతిరావు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఇక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 28 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

అక్రమంగా ప్రభుత్వ మందులు విక్రయం

- ఫార్మసిస్టుతో పాటు మరో వ్యక్తి అరెస్టు
- 80వేల విలువైన మందుల స్వాధీనం
- డ్రగ్స్ కంట్రోల్, టాస్క్‌ఫోర్స్ పోలీసుల జాయింట్ ఆపరేషన్




అరెస్టు చూపుతున్న పోలీసులు

వరంగల్ మెడికల్, మార్చి 21: ప్రభుత్వ మందులను కాజేసి అక్రమంగా విక్రయిస్తు న్న ప్రభుత్వ ఫార్మసిస్టును ఔషధ నియంత్రణ శాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు తలకోటి నాగేందర్‌ను అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన బలరాందాసును కూడా అరెస్టు చేసి మందులను స్వాధీనం చేసుకున్నారు. ఔషధ నియంత్రణ శాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో తలకోటి నాగేందర్ కొన్నేళ్లుగా ఫార్మసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇతడు ఇదే ఆస్పత్రికి సంబంధించిన మందులను హైదరాబాద్‌కు చెందిన బలరాం దాసు అనే వ్యక్తికి విక్రయిస్తుండగా బుధవారం సాయంత్రం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫార్మసిస్టు నాగేందర్ మందులు కాజేసి తనకు పరిచయం ఉన్న బలరాందాసుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. బలరాందాస్ కూడా ఈ మందులను హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తూ లాభం పొందుతున్నాడని పోలీసులు వెల్లడించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని సుమారు రూ.80వేల విలువజేసే అమాక్సిలిన్ పొటాషియం క్లావులెంట్ 34 బాక్సులు, కంటి చుక్కల మందులు 240 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ పంచనామా నిర్వహించి ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

మందులోళ్లు.. మాయలోళ్లు..
అక్రమంగా ప్రభుత్వ మందుల విక్రయాలు
కంటి ఆస్పత్రిలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న దందా

వివరాలు 7లో..

వరంగల్ టికెట్‌పై కుదరని ఏకాభిప్రాయం
తలో పేరుతో అధిష్ఠానంపై మంత్రుల ఒత్తిడి
ఏఐసీసీ సీఈసీలో వరంగల్ సీటుపైనే ప్రధాన చర్చ
ఎంపీ దయాకర్‌తోపాటు ఇందిరా, సాంబయ్య, పరంజ్యోతిల్లో అవకాశమెవరికో?



తెరపైకి రోజుకో పేరు

కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై ఆశావహుల్లో ఉత్కంఠ

(వరంగల్- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిగా రోజుకోపేరు తెరపైకి వస్తోంది. దీంతో అటు ఆశావహులతో పాటు.. ఇటు కేడర్‌లోనూ గందరగోళం ఏర్పడుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేకపోవటంతోనే ఇదంతా జరుగుతోందని, ఏఐసీసీ కూడా ఆచితూచి అడుగులు వేస్తోందన్న చర్చ జరుగుతోంది. నిన్నటి వరకు దొమ్మాటి సాంబ య్యకే టికెట్ ఖరారైందన్న ప్రచారం జరగ్గా.. అనూహ్యంగా సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ పేరు తెరపైకి రావటం చర్చనీయాంశమైంది. వరంగల్ టికెట్ కోసం ఈ నియోజకవర్గం నుంచి 50మందికి పైగా క్యూ కట్టినప్పటికి అన్ని వడపోతల తరువాత నలుగురు పేర్లపైనే ప్రధానం గా చర్చ జరిగినట్టు సమాచారం. గురువారం సాయంత్రం కాంగ్రెస్ జాబితా విడుదలగా.. అందులోనూ వరంగల్ అభ్యర్థి ఎవరనేది స్పష్టత రాలేదు. ఇక హోలీ పండుగ తర్వాతే వరంగల్ అభ్యర్థిత్వం ఎవర నేది తేలుతుందని భావిస్తున్నారు.

కాంగ్రెస్‌కు సవాల్‌గా అభ్యర్థి ఎంపిక..

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన వరంగల్‌పై కాంగ్రెస్‌లోని ఆశావాహులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అత్యధికంగా 42మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ మూడు పేర్లతో జాబితా తయారు చేసి ఏఐసీసీకి నివేదిక పంపించింది. ఈ జాబితాలో గత ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి ఓటమిపాలైన దొమ్మాటి సాంబయ్యతో పాటు స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరా, నమిండ్ల శ్రీనివాస్ పేర్లు ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే సీఎం రేవంత్ వరంగల్ టికెట్‌ను దొమ్మాటి సాంబయ్యకే ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారని, మొదటి జాబితాలో ఆయన పేరుంటుందని చర్చ జరిగింది. కానీ అనూహ్యంగా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు మరో ఇద్దరి ముగ్గురు పేర్లను సూచిస్తూ ఏఐసీసీ అగ్రనేతలకు లేఖలు ఫ్యాక్స్ చేశారు. దీంతో తొలిజాబితాలో వరంగల్ టికెట్‌ను పెండింగ్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్‌లో చేరటంతో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఏర్పడింది.

వరంగల్‌పై కుదరని ఏకాభిప్రాయం..

అభ్యర్థిత్వం కోసం అనేక మంది ఆశావాహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉండగా.. రాష్ట్ర మంత్రులతో పాటు ఏఐసీసీ అగ్రనేతలు కూడా తమ అనుచరులకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో వరంగల్ టికెట్‌పై ఎడతెగని ఉత్కంఠ కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి తనతోపాటు కాంగ్రెస్‌లో చేరిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారని, కానీ వరంగల్‌కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు తలో పేరు సూచిస్తున్నారని సమాచారం. ఇక మొదటి నుంచి కాంగ్రెస్ టికెట్‌ను జన్ను పరంజ్యోతికి ఇప్పించేందుకు మంత్రి కొండా సురేఖ ప్రయత్నించినట్టు ప్రచారం జరిగింది. అలాగే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తదితరులు స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరకు

మిగతా 8వ పేజీలో..

హోలీ తర్వాతేనా?

వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య ఖరారవడంతో ప్రచారం కూడా ప్రారంభించారు. బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేష్‌కే టికెట్ ఖాయమని ప్రచారం జరుగుతుండటంతోపాటు ఆయన కూడా పార్టీలో నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. కానీ, కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపిక సవాల్‌గా మారటంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, మంత్రి కొండా సురేఖ సూచించిన వారికే అధిష్ఠానం మొగ్గు చూపుతుందా? లేదంటే మంత్రులు, ఏఐసీసీ నేతలు సూచించిన అభ్యర్థి వైపు కాంగ్రెస్ మొగ్గు చూపుతుందా? సర్వేల ఆధారంగా గెలుపు అవకాశాలున్న అభ్యర్థిని నిలబెడతారా అన్న చర్చ జరుగుతోంది. ఏకాభిప్రాయం కుదిరితే హోలీ పండుగ తర్వాతే జాబితా అభ్యర్థి ప్రకటన కూడా ఉంటుందని భావిస్తున్నారు.

ఓటు వేసే విధంగా ఓటర్లను చైతన్యపరచాలి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి21: ఓటు హక్కు కలిగిన ప్రతీ ఓటరును ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వీప్ ఆధ్వర్యంలో గురువారం వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ.. స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఆర్‌వో వైవీ గణేష్, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21: వరంగల్ రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్ల కోసం ఈనెల 23 వరకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికిగాను కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని ఆమె తెలిపారు. www.tswreis.ac.in వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.



ఉప రాష్ట్రపతిని కలిసిన వద్దిరాజు రవిచంద్ర

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ రవిచంద్ర

వరంగల్ సిటీ, మార్చి 21: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గురువారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ శాసన సభ్యులు మీసేవలను గుర్తించి, మీ పట్ల విశ్వాసం ఉంచి తిరిగి రాజ్యసభకు పంపించారని ఈ సందర్భంగా జగదీప్ ధన్‌కర్ రవిచంద్రను అభినందించారు. అదేవిధంగా ఈ ప్రజాస్వామ్య(పార్లమెంట్) దేవాలయంలో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు జరిపేందుకు మీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని రవిచంద్రతో అన్నారు. స్పందించిన రవిచంద్ర ధనకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య



ప్రశాంత్(ఫైల్)

ఐనవోలు, మార్చి 21: ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐనవోలులో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బరిగెల ప్రశాంత్(24) మూడేళ్ల నుంచి కొంత మంది రైతుల వద్ద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగుచేయగా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన రూ.4లక్షల అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వేలాడుతున్న ఉరి నుంచి అతడిని తప్పించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కౌలు రైతుగా చేసిన అప్పులు తీర్చే దారి కనిపించక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య అనుషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

మందులోళ్లు.. మాయలోళ్లు..

● అక్రమంగా ప్రభుత్వ మందుల విక్రయాలు ● కంటి ఆస్పత్రిలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న దందా



వరంగల్ మెడికల్, మార్చి 21: ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మాయలోళ్లు తయారయ్యారు. మందులు పంపిణీ చేసే ఉద్యోగులు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఔషధాలను పేద రోగులకు ఇవ్వకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇదంతా ఏళ్ల తరబడి జరుగుతున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఏకంగా అక్రమ మందుల విక్రయాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకునేంతవరకు కూడా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆరోపణలు వచ్చినా అంతే..

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఫార్మసిస్టు నాగేందర్‌పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోవడం లేదు. గతంలో స్టోర్స్‌లో పనిచేసిన ఈయన.. మళ్లీ అదే ఆస్పత్రిలో ఓపీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. కొన్నేళ్లుగా ఇదే ఆస్పత్రిలో తిష్ట వేయడంతోపాటు అన్ని విషయాలు అవపోసనపట్టి అక్రమంగా మందులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీఎంతోపాటు బోధనాస్పత్రుల్లో కూడా ఈ దందా కొనసాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మురికివాడల్లోని అర్బన్ సెంటర్లలో కూడా మందులు పక్కదారి పడుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

మార్కెట్‌లో శాంపిల్స్

వివిధ కంపెనీలు డాక్టర్లకు ఇచ్చే శాంపిల్ ఔషధాలు కూడా మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ఇవి డాక్టర్ ద్వారా రోగులకు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మెడికల్ షాపులు విక్రయాలకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా కొందరు లేబుళ్లను మార్చి నకిలీ మందులను కూడా తయారు చేస్తున్నట్లు కొంతకాలంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్ డాక్టర్ చిట్టీ లేకుండానే అమ్ముతున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ తనిఖీల్లో అనేక పర్యాయాలు బయటపడింది. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కాజీపేట సమీపంలోని నిట్‌క్యాంపస్ ఏరియాలో నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు కొనసాగుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే..

ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల గల్లీలో నిబంధనలకు విరుద్ధంగా అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే వెలిశాయి. మెడికల్ షాపుల్లో సైతం అద్దాలు విక్రయించడం కనిపిస్తుంటుంది. కంటి ఆస్పత్రి నాలుగో తరగతి ఉద్యోగులు ప్రయివేట్ అద్దాల షాపులతో కుమ్మక్కై రోగులను బయటకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా కంటి అద్దాలను విక్రయాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా ఈ దందా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడం గమనార్హం.

సమర్థవంతంగా పనిచేస్తున్న సంఘాలు

నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ



మాట్లాడుతున్న కుమార్ సాహూ

కాళోజీ జంక్షన్, మార్చి 21: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 రైతు ఉత్పత్తి దారుల సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, సంఘాలు ఏర్పడిన మొదట్లో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం చాలా సంఘాలు విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ అన్నారు. నాబార్డు వరంగల్ క్లస్టర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి అవసరమైన శిక్షణ, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కందులను డైరెక్టుగా కాకుండా పప్పుగా మార్చడం ద్వారా రైతుకు రెట్టింపు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వరంగల్ డీడీఎం చంద్రశేఖర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సంతోష్, కార్తీక్, హర్షవర్ధన్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు రెడ్‌క్రాస్ చైర్మన్ శుభాకాంక్షలు



గవర్నర్‌కు బోకే అందజేస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, సభ్యులు

కాళోజీ జంక్షన్, మార్చి 21: రాష్ట్ర నూతన గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ రాధాకృష్ణన్‌ను హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్ క్రాస్ కార్యక్రమాలపై జిల్లా చైర్మన్లు రాష్ట్ర పాలక వర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రెడ్ క్రాస్ సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని ఇక ముందు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. వేసవి కాలం దృష్ట్యా బ్లడ్ సెంటర్లలో రక్తం కొరత లేకుండా చూడాలని ఆయన సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్ష తప్పదు

రౌడీషీటర్లకు హనుమకొండ సీఐ సతీష్ హెచ్చరిక



రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్

హనుమకొండ టౌన్, మార్చి21 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినట్లయితే కఠినమైన శిక్షలు తప్పవని హనుమకొండ సీఐ వై.సతీష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడుంటున్నారు..? ఎవరెవరు ఏమి చేస్తున్నారు? అనే దానిపై అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలల వ్యవధిలో బైండోవర్ కాని వారిని తప్పనిసరిగా ఈసారి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎవరెవరిపై కేసులు నమోదయ్యాయని ఆరా తీశారు. అసాంఘిక చర్యలకు పాల్పడ్డట్లు ఫిర్యాదు అందితే ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. కౌన్సెలింగ్ హాజరుకాని వారికి త్వరలోనే నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్‌లో సీఐతోపాటు ఎస్సైలు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

'బార్' బరిలో వీరే..

హనుమకొండ బార్ ఎన్నికల్లో పోటాపోటీ

వరంగల్ లీగల్, మార్చి 21: హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరుగనున్న ఎన్నికల బరిలో 32 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధ్యక్షస్థానానికి ఎం.రమేష్‌బాబు, పి.సత్యనారాయణ పోటీ పడుతుండగా ఉపాధ్యక్ష పదవికి పి.రఘుపతి, ఎస్.రాజన్‌బాబు, పి.రవీందర్, ఎస్.యుగంధర్ బరిలో ఉన్నారు. అలాగే ప్రధానకార్యదర్శి పదవికి వి.నరేందర్, పి.నవీన్‌కుమార్, ఎల్.రమేష్. బి.శంకర్, ఆర్.వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. మహిళా జాయింట్ సెక్రటరీ పదవికి వి.పద్మ, జె.స్వప్న, స్పోర్ట్స్ కల్చరల్ జాయింట్ సెక్రటరీ పదవికి పి.చిరంజీవి, ఎం.మహేష్ పటేల్. సి.మల్లేష్, కోశాధికారి పదవికి జి.సదానందం, పి.సమ్మిరెడ్డి, ఎ.శివశంకర్‌లు పోటీ పడుతున్నారు. కార్యవర్గ సభ్యులుగా డి.అచ్యుత్‌కుమార్, జి.అనిల్ లాలానాయక్, ఇ.చంద్రశేఖర్, సీహెచ్.నిఖిల్‌కుమార్, వి.రమేష్, కె.రుత్విక్, ఎ.సందీప్‌కుమార్, ఎన్.సుహాస్, డి.సునిల్‌కుమార్, మహిళా కార్యవర్గ సభ్యుల పదవికి జి.రమాదేవి, కె.ఉష పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ఎన్.విజేందర్, లైబ్రరీ జాయింట్ సెక్రటరీ పదవికి బి.సంపత్, 30 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా జి.సురేందర్‌రెడ్డి, 20 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా టి.శ్రీనివాస్, 10 ఏళ్ల మహిళా న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గసభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

కాజీపేట, మ్యా 21 : చిరువ్యాపారుల గల్లా పెట్టెల్లోంచి నగదు చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మూడు రోజుల క్రితం కాజీపేటలో నాగరాజు ఫ్రూట్ షాపులో ఓ వ్యక్తి ఫ్రూట్స్ కొనుగోలు చేసి అతడి దృష్టి మరల్చి గల్లా పెట్టెల్లోంచి రూ.1250 చోరీ చేశాడు, నాగరాజు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం కడిపికొండ బ్రిడ్జి వద్ద పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోతుండగా అతడిని పట్టుకుని ఆరా తీయగా అతడి పేరు యాకుబ్ పాష అని వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఇతను కాజీపేట ఫ్రూట్ షాపులో నగదును, పలు షాపులలో చోరీలకు పాల్పడుతున్నానని ఒప్పుకున్నాడు. నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపారు. కేసును చేధించిన ఎస్సై శివకృష్ణ, కానిస్టేబుల్స్ భాస్కర్, విష్ణులను ఏసీపీ తిరుమల్ రావు అభినందించారు.

పోలీసు అధికారిపై పోక్సో కేసు?

రహస్యంగా పోలీసుల విచారణ

వరంగల్ క్రైం, మార్చి21: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం సీఐగా పొరుగు జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు అధికారిక సమాచారం. 2022 సంవత్సరంలో కేయూలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సదరు అధికారికి స్టేషన్ పరిధిలో ఒక మహిళతో సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం. ఈ విషయంలో మహిళ భర్త పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఏఆర్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. అనంతరం సీఐగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లాకు, అటునుంచి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన సదరు అధికారి.. ఇంకా మహిళతోనే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు మహిళ కూతురిపై కన్నేసిన పోలీసు అధికారి.. అత్యాచారయత్నం చేసినట్లు తెలిసింది. మైనరైన తన కూతురుపై పోలీసు అధికారి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఇటీవల కేయూలో మహిళ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ చేసిన కేయూ పోలీసులు.. గురువారం సదరు అధికారిపై అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కేయూ పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా చెప్పేందుకు నిరాకరించారు. పోలీస్ అధికారి కావడంతో వివరాలు వెల్లడించలేదు. రహస్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

లారీ డ్రైవర్‌పై కానిస్టేబుళ్ల దౌర్జన్యం

● కేసముద్రంలో వారం కిందట ఘటన
● ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ

కేసముద్రం, మార్చి 21 : కేసముద్రం స్టేషన్‌లో ఓ లారీ డ్రైవర్‌పై ఇద్దరు కానిస్టేబుళ్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తూ బట్టలు విప్పి డ్రాయర్‌పై లాగుతున్న ఫొటో గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇసుకను రవాణా చేసిన ఒక లారీ డ్రైవర్‌పై కేసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అసభ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ వంశీధర్‌ను వివరణ కోరగా, ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చామని, దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా విచారణ అనంతరం సదరు కానిస్టేబుళ్లను నేడోరేపో సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి సమాచారం అందింది.

మానుకోటలో 'రజాకార్' సందడి

లక్ష్మీ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించిన చిత్ర యూనిట్



మహబూబాబాద్ లక్ష్మీ థియేటర్‌లో మాట్లాడుతున్న సినీ నటి అనసూయ

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 'రజాకార్' చిత్రం యూనిట్ సభ్యులు గురువారం సందడి చేశారు. సినిమా విజయవంతంగా ప్రదర్శిస్తున్న నేపథ్యం లో అందులోని నటీనటులు అనసూయ, రాజ్‌అర్జున్, గిరి, శివం, సత్యనారాయణ, రమణ, అంజిరెడ్డి, పూజ, సినీ దర్శకుడు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు, మానుకోట ప్రాంతవాసి బీమ్స్ సిసిరోలియో మానుకోటలో పర్యటించారు. రజాకార్ చిత్రం ప్రదర్శింపబడుతున్న లక్ష్మీ థియేటర్‌కు యూనిట్ సభ్యులు చేరుకోవడంతో ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి, ఘనస్వాగతం పలికారు. బాణ సంచాలు కాల్చుతూ, పూలుచల్లుకుంటూ ఆహ్వానించారు. యూనిట్ సభ్యులు కొద్దిసేపు ప్రేక్షకులతో కలసి సినిమాను వీక్షించారు. అక్కడకు వచ్చిన ప్రేక్షకులు, అభిమానులు నటీనటులు, సంగీత దర్శకుడితో ఫొటోలు దిగడానికి ఉత్సాహం చూపారు.

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాలి

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సినీనటి అనసూయ అన్నారు. నాడు రజాకార్లు హైదరాబాద్ సంస్థానంలో ప్రజలను ఎంత ఇబ్బంది పెట్టారో రజాకార్ చిత్రంలో చూపించడం జరిగిందని, తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతీఒక్కరు ఈ సినిమాను చూడాలని కోరారు. నాడు రజాకార్ల ఆగడాలను ఎదిరించిన యోధుల చరిత్రను మరువద్దన్నారు. ఈ సినిమాతో తనకు మరింత గుర్తింపు వచ్చిందని, ఇందులో తనకు నటించే అవకాశం కల్పించిన దర్శకుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. మానుకోట ప్రాంతవాసి సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు మంచి సంగీతాన్ని అందించారని చెప్పారు.

స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం

నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల ఆగడాలను ఎదురించి పోరాడిన యోధుల చరిత్రను భావితరాలకు అందించేందుకు తీసిన చిత్రం రజాకార్ అని సినీ దర్శకుడు యాట సత్యనారాయణ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న అందరికీ ఈ చరిత్ర తెలువాలన్నారు. నాడు పర్కాలలో తొలి జాతీయజెండా ఎగురవేత, వరంగల్ జిల్లాలోని ఖిలాలో బత్తిని మొగిలయ్య జెండాను ఎగురవేసిన చరిత్ర రజాకార్ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించామన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ గత చరిత్ర భావితరాలకు తెలియకుంటే మన చరిత్రను తెలియ జేయడానికి ఎవరూ ఉండరని చెప్పారు. రజాకార్ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో లక్ష్మీ థియేటర్ యాజమాని చాపల రంజిత్‌రెడ్డి, డాక్టర్ బానోత్ వీరన్న, డాక్టర్ పరికిపండ్ల అశోక్, స్థానిక సినీ నటులు రాజు, శ్రీను పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం మండలకేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రజాకార్ చిత్ర యూనిట్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనలో పేదల పక్షాన పోరాడి అమరులైన వీరులు చిరస్థాయిలో చరిత్రలో నిలిచి పోతారని చెప్పారు. అనంతరం రజాకార్ చిత్ర విశిష్టతను ప్రజలకు తెలియపర్చిన యూనిట్ సభ్యులు ప్రతీ ఒక్కరు ఈ సినిమాను చూడాలని విజ్ఞప్తి చేశారు. చిత్ర యూనిట్ సభ్యులకు కళాకారులు ఘన స్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో సినీనటి అనసూయ, దర్శకులు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో, బయ్యారం వీరన్న పాల్గొన్నారు.

గందరగోళంలో 'గృహజ్యోతి'



● జీరో బిల్లు రాకపోవడంతో వినియోగదారుల్లో అయోమయం
● తిరస్కరణకు గురైన దరఖాస్తులకు ఎన్నికల కోడ్ అడ్డంకి
● తర్వాత జీరో బిల్లు ఇస్తామంటున్న విద్యుత్ అధికారులు

హనుమకొండ టౌన్, మార్చి 21: 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్నప్పటికీ జీరో బిల్లు రాకపోవడంతో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీరో బిల్లు రాని వాళ్లు మరోసారి మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అయా కౌంటర్లలో ఎన్నికల్లో కోడ్ పేరిట దరఖాస్తులను స్వీకరించడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో హైరానా మొదలైంది. తెల్లరేషన్ కార్డు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకునే కుటుంబాలు జీరోబిల్లు రాకున్నా విద్యుత్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి చెప్పినప్పటికీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. విద్యుత్‌శాఖ అధికారులు సైతం ఎన్నికల తర్వాత మార్చి, ఏప్రిల్, మే నెలలకు కలిపి జీరో బిల్లు ఇస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెబుతున్నప్పటికీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది.

అవగాహన లోపం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు సమయంలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి.. ఏ పథకానికి ఏ వివరాలు నింపాలి.. అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం చెందారు. ఫలితంగా కొంతమంది లబ్ధిదారులు ఒకదాని బదులు ఇంకొకటి రాశారు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకునే సమయంలో యుఎస్సీ నెంబర్‌కు బదులు ఎస్సీ నెంబర్ రాశారు. ఇంకొందరు సరిగ్గా రాసినప్పటికీ డాటా ఎంట్రీ చేసే సమయంలో అయిన తప్పిదాల కారణంగా జీరో బిల్లు రాలేదని తెలుస్తోంది. అయితే మరోసారైనా సరిగా దరఖాస్తు చేసుకుందామని మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నప్పటికీ దరఖాస్తులు స్వీకరించపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

హనుమకొండ జిల్లాలో 1,02,56 మంది దరఖాస్తు చేసుకోగా, 98,864 మందికి మాత్రమే జీరోబిల్లు వచ్చింది. జనగామ జిల్లా నుంచి 78,655 మంది దరఖాస్తు చేసుకుంటే 77,822 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు. మహబూబాబాద్ జిల్లా నుంచి 90,026 మందికి 88,658 మంది మాత్రమే జీరోబిల్లు పొందారు. అదే విధంగా ములుగు, భూపాలపల్లి నుంచి 77,250 మంది దరఖాస్తు చేసుకుంటే 72,638 మంది జీరోబిల్లు పొందారు. వరంగల్ జిల్లా నుంచి 1,02,836 మంది దరఖాస్తు చేసుకుంటే 99,426 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు.

రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం

ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



కాజీపేటలోని మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట, మార్చి 21: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంటనష్టంపై అంచనావేయాలని అధికారులను ఆదేశించారని స్టేట్ కో- ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మీడియా పాయింట్‌లో జంగా రాఘవరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. తెలంగాణ కోసం 12 వందల మంది ఉద్యమకారులు ప్రాణాల త్యాగాలు చేస్తే బోగాలు అనుభవించి, విపరీతమైన ఆస్తులు సంపాదించింది మాత్రం కల్వకుంట్ల కుటుంబమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవ చేశారు. రైతుల కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు.

రైతు అభివృద్ధిపై ఎర్రబెల్లి దయాకర్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దయాకర్‌రావు ఓ పెద్ద దొంగ అని, ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీజేపీ సైతం రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కోసం బీజేపీ డ్రామాలు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం అన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుంచు చంద్రయ్య, తొట్ల రాజు యాదవ్, బోయిని కుమార్, గద్దం కోటేశ్వర్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేశ్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

గీసుగొండ, మార్చి 21: ధర్మారం జెడ్పీ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి గాను ఎన్‌సీసీ కేడెట్‌ల ఎంపికను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత, దేహదా రుఢ్య పరీక్షలను నిర్వహించి 46 మందిని ఎంపిక చేసినట్లు చీఫ్ ఆఫీసర్ రవిందర్ తెలిపారు. కార్యక్రమంలో సుబదారి అజిత్‌కదం, హావల్దార్‌లు విజయ్, ముల్లా, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు

శంభునిపేట.. సమస్యల పుట్ట

• గుంతలమయంగా మారిన మట్టికోట • నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు • రోడ్డుపైనే చికెన్ వ్యర్థాలు • పట్టించుకోని అధికారులు, పాలకులు



ఖిలావరంగల్ వైపు వెళ్లే మట్టికోట రోడ్డు మార్గం

కరీమాబాద్, మార్చి 21: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 41వ డివిజన్ శంభునిపేటలో సమస్యలు పేరుకుపోయాయి. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ ప్రాంతం సమస్యల్ని పరిష్కరించడంలో అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు చొరవ చూపడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. శంభునిపేట జంక్షన్ నుంచి ఖిలావరంగల్ వైపు మట్టికోటకు వెళ్లే దారి ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలోని అన్ని డివిజన్లలో సీసీ రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టారు. కానీ ఈ డివిజన్‌లో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదిలాఉంటే ఈ దారిలో కొందరు చికెన్ సెంటర్ నిర్వాహకులు రోడ్డుకు ఇరువైపులా చికెన్ వ్యర్థాలు, చెత్త చెదరాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. ఈ దారి గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

నిధులు మంజూరైన ప్రారంభం కాని పనులు...

స్మార్ట్ సిటీ నగరాభివృద్ధి పనుల్లో భాగంగా శంభునిపేట జంక్షన్ ప్రాంతం నుంచి, దసరా రోడ్డు కూడలి మీదుగా ఖిలావరంగల్ మట్టికోట వరకు రోడ్డు నిర్మాణానికి స్మార్ట్ సిటీ నిధుల నుంచి రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. అయినా ఇప్పటివరకు పనులు ప్రారంభానికి నోచకోలేదు. కనీసం ప్రజా ప్రతినిధులు, అధికారులు పనుల కోసం చొరవచూపిన దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం..

శంభునిపేట ప్రాంతంలోని గవిచెర్ల క్రాస్ రోడ్డు, దూపకుంట రోడ్డు, శంభునిపేట జంక్షన్ ప్రాంతంలో ఇలా రోడ్డుపై వ్యాపార సముదాయాలు ఇష్టారీతిన వెలుస్తున్నాయి. వ్యాపారం నిర్వహించుకోవాల్సిన ప్రదేశం నుంచి నిబంధనలు అతిక్రమించి వీధి వ్యాపారస్థులు తమ వ్యాపారాలను రోడ్డు పైకి విస్తరిస్తూ రోడ్డు నిర్మాణాలు చేస్తుండటంతో జంక్షన్‌లో వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

డివిజన్‌లో సమస్యలు పేరుకుపోతున్నా.. అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన స్థానికప్రజా ప్రతినిధులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో అదిచేస్తాం..ఇది చేస్తాం అని చెప్పిన నాయకులు ఇప్పుడు మాత్రం కానరావడం లేదంటున్నారు.



గుంతల మయంగా కనిపిస్తున్న రోడ్డు మార్గం

అధిక రేటుకు మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సంగెం, మార్చి 21 : సంగెం మండల కేంద్రంలో మద్యం ఎక్కువ రేటుకు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సంగెం హెడ్ కానిస్టేబుల్ చందర్‌రావు తెలిపారు. బుధవారం రాత్రి పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న చిర్రా ఆనంద్ (42)ను పట్టుకొని విచారించినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతి లేకుండా అధిక రేట్లకు మద్యం అమ్ముతున్నట్లు గురువారం విచారణ తెలిందని వివరించారు. పెంట్రోల్ పంపు ఏరియాలో అమ్మకం చేస్తున్న ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

సంగెం, మార్చి 21 : కొత్తగూడెంలో గురువారం పశువులకు గాలికుంట వ్యాధి టీకాలు వేశారు. పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సంగెం పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు, గోపాల మిత్రులు, కమలాకర్, బాబు, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారానికి బీఎస్పీ పోరాటం



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మదన్‌కుమార్

పోచమ్మమైదాన్, మార్చి 21: పేదల సమస్యల పరిష్కారం కోసం బహుజన సమాజ్ పార్టీ అనునిత్యం పోరాటాలు సాగిస్తుందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గుండాల మదన్‌కుమార్ అన్నారు. పోచమ్మమైదాన్‌లో గురువారం పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మసాని రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పార్టీని కొంతమంది వ్యక్తులు వీడిపోతే కలిగే నష్టం ఏమిలేదని అన్నారు. బహుజన బిడ్డలు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కష్టపడాలని సూచించారు. వరంగల్ పార్లమెంట్‌కు త్వరలోనే అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బుర్రి సాగర్, రాజేశ్వరి, భరత్, శ్రీకాంత్, సామ్యూల్, కొమురయ్య ప్రసంగి, నేలిమ, మౌనిక పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న ఎస్ఐ రాజు

పోచమ్మమైదాన్, మార్చి 21: పైడిపెల్లిలో శిక్షణ పొందుతున్న జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. జైజవాన్- జైకిసాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఏనుమాముల ఎస్ఐ రాజు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు టీ షర్టులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో 23 నుంచి 27 వరకు జరిగే 45వ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ బాలుర చాంపియన్ షిప్‌లో పాల్గొననున్న క్రీడాకారులు గెలుపొంది, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పవన్ కుమార్, ఇట్యాల శ్రీనివాస్, జన్ను కుమార్, ఇట్యాల సతీష్, జన్ను అరుణాకర్, జన్ను సుధాకర్, రవికుమార్, స్వామి, దామోదర్, రజినీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ ప్రజాసంఘం' లీగల్‌సెల్ కన్వీనర్‌గా కోల



కార్తీక్ గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, తదితరులు

కరీమాబాద్, మార్చి 21: తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా రంగశాయిపేట ప్రాంతానికి చెందిన కోల కార్తీక్ గౌడ్ నియమితులయ్యారు. గురువారం హైదరా బాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కార్తీక్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీబీపీఎస్ రాష్ట్ర యూత్ ఇన్‌చార్జి వెలకుర్తి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షుడు కుళ్ల సతీష్, యూత్ నాయకులు పగడాల భరత్, బీసీ నాయకులు అనిల్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కో ఆర్డినేటర్ కన్నుమూత

వరంగల్ కల్చరల్, మార్చి 21: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ కో ఆర్డినేటర్ వరంగల్ మహిళా వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షురాలు మదూరి విజయలక్ష్మి (55) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. రెండేళ్లుగా ఆమె అనారోగ్యంతో చికిత్సపొందుతూ స్వగృహంలో కన్నుముశారు. ఆమెకు భర్త, కుమారుడు ఉన్నారు. విజయలక్ష్మి మృతికి క్లబ్ వైస్ గవర్నర్ గుమ్మడవెల్లి సత్యనారాయణ, మాజీ వాసవీ క్లబ్ అధ్యక్షుడు తాటిపెల్లి వాసుదేవులు, మాజీ మేయర్, మాజీ వాసవీ క్లబ్ అధ్యక్షుడు గుండా ప్రకాష్‌రావు, వాసవీ క్లబ్ మహిళా నాయకులు రవ్వ గీత, కళావతి, శైలజ, సుమ, జానకీతో పాటు వాసవీ క్లబ్ సభ్యులు మృతదేహానికి నివాళులర్పించారు.



విజయలక్ష్మి

ప్రభుత్వ పాఠశాలకు చేయూత



వాటర్ ప్యూరీఫైర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పోచమ్మమైదాన్, మార్చి 21: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని మా సూం అలీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రతినిధు లు చేయూ తనంది ంచారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం వడ్డెపల్లి శివకు మార్- శ్రీవాణి సహకారంతో రూ. 40 వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీఎన్ స్వామి, క్లబ్ అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్, మహేశ్వర్, ఆర్‌సీ సుభాష్, రాజీవ్ బాను, ఆర్‌కే రాజు, సురేందర్, గుండేటి రమణ య్య, వంగరి వేణుగోపాల్, జయబాలరెడ్డి, మనోహర్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

'గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు వహించాలి



ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పోచమ్మమైదాన్, మార్చి 21: వేసవిలో ఎండదెబ్బ తగలకుండా గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకో వాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జక్కుల లావణ్య అన్నారు. ఆరెపల్లిలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాటా డుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సమతుల ఆహారం, పరిశుభ్రత, పరిశుభ్రమైన ఆహారతయారీపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గంగ, కళావతి, స్వర్ణలత, సుజాత, శారద తదితరులు పాల్గొన్నారు.

సీపీఈ సెమినార్

వరంగల్ చౌరస్తా, మార్చి 21: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ బ్రాంచి ఆధ్వర్యంలో ఒక్కరోజు సీపీఈ సెమినార్‌ను గురువారం నిర్వహించారు. హైదరా బాద్‌లో జరిగిన ఈ సమావేశానికి ఆల్ ఇండియా ఐసీఏఐ అధ్యక్షుడు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ రంజిత్‌కుమార్ అగర్వాల్ పాల్గొనగా వరంగల్‌కు చెందిన పలువురు చార్టర్ట్ అకౌంటెంట్స్ వరంగల్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో వరంగల్ మాజీ అధ్యక్షుడు ప్రముఖ సీఏ పీవీ నారాయణరావు సమావేశంలో స్వాగతోపన్యాసం చేశారు. రంజిత్ కుమార్ అగర్వాల్‌ను వరంగల్ తరపున సన్మానించారు. వరంగల్ బ్రాంచి అధ్యక్షుడు సీఏ భగవాన్‌దాస్ ముందాడ, కార్యదర్శి మాదారపు సుజిత్‌తోపాటు సీఏలు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీ.. మిషన్ ధ్వంసం

మట్టెవాడ, మార్చి 21: వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంతో రూ.10వేల చోరీతోపాటు ఏటీఎం మిషన్ ధ్వంసం చేసిన ఘటన మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మట్టెవాడ సీఐ టి.గోపి తెలిపిన వివరాల ప్రకారం. రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన ఏంటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం మిషన్‌ను ట్యాంపరింగ్ చేసి రూ.10వేల నగదును దొంగిలించినట్లు తెలిపారు. తర్వాత మిషన్‌ను ధ్వంసం చేసినట్లు ఎస్‌బీఐ బ్యాంచ్ మేనేజర్ దార్ల భిక్షపతి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసిన సమయంలో అనుమానిత వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

నేడు అంగడి వేలం పాట

పర్వతగిరి, మార్చి 21 : మండల కేంద్రంలోని అంగడి (వారాంతపు సంత), షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలం పాటల ను నిర్వహించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి రఘు తెలిపారు. గురువా రం వారు విలేఖరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సం వత్సరానికిగాను నిర్వహించే అంగడి వేలంలో పాల్గొనేవారు రూ.50వేలు ముందస్తుగా డిపాజిట్ చేయాలని అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ 20గదులకు గాను వేలంలో పాల్గొనే వారు రూ.25 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

ఎంపీపీపై అవిశ్వాసం?

రేపు వరంగల్ ఆర్డీవోకు వినతి

సంగెం, మార్చి 21: సంగెం ఎంపీపీ కందకట్ల కళావతిపై అవిశ్వాసం పెట్టేందుకు మండలంలోని ఎంపీటీసీలు గురువారం రాత్రి నిర్ణయం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మండలంలో 14 ఎంపీటీసీలుండగా ఇద్దరు గవిచర్ల ఎంపీటీసీ, రాంచంద్రాపురం ఎంపీటీసీలు కాంగ్రెస్‌కు చెందిన వారుకాగా, మిగతా వారంతా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారున్నారు. వీరంతా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని కలిసి అవిశ్వాసం విషయంపై చర్చించినట్లు పలు గ్రామాల ఎంపీటీసీలు విలేకరులకు సమాచారం అందించారు. వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్యతోపాటు ఎంపీటీసీల ఫోరం మండలశాఖ అధ్యక్షుడు రంగరాజు నర్సింహస్వామి, కాపులకనపర్తి ఎంపీటీసీ సుతారి బాలకృష్ణ, ఎల్గూరురంగంపేట ఎంపీటీసీ భానోతు పద్మ,పల్లార్‌గూడ ఎంపీటీసీ గుగులోతు వీరమ్మ, చింతపల్లి ఎంపీటీసీ బొమ్మ పావని, కాట్రపల్లి ఎంపీటీసీ గాయపు ప్రచూర్ణనల్లబెల్లి ఎంపీటీసీ కట్ల సుమలత, లోహిత ఎంపీటీసీ అడ్డగట్ల దుర్గారావు,మొండ్రాయి ఎంపీటీసీ కొనకటి రాణి, సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్యలు కలిసి ఈనిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం వరంగల్ ఆర్డీవోను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఎంపీపీగా కొనసాగుతున్న కళావతి పార్టీని వీడుతుండడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మండల కో ఆప్షన్‌మెంబరు మన్సూర్ అలీతోపాటు వారంతా కలిసి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని కలిసి అనుమతి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా, పల్లార్‌గూడ ఎంపీటీసీగా కొనసాగుతున్న మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మకు ఎంపీపీ పదవిని కట్టబెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది.

బీఆర్ఎస్‌ను వీడే వారితో నష్టం లేదు: ధర్మారెడ్డి

బీఆర్ఎస్ పార్టీని వీడే వారితో ఎలాంటి నష్టంలేదని మాజీ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఇంటిలో మండలానికి చెందిన జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మండల కో-ఆప్షన్ మెంబరు మన్సూర్‌అలీతో పాటు పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలతో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసే వారికి అండగా ఉంటామని చెప్పారు. పార్టీకి ద్రోహం చేసేవారిని క్షమించేదిలేదని అన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్న వారి గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంగెం ఎంపీపీ కళావతి పార్టీని వీడుతున్నట్లు తెలిసిందని ఆయన చెప్పారు. పదేళ్లపాటు అధికారం కేసీఆర్ నాయత్వంలో ఉండి ప్రజలకు సేవలు అందించిన వారంతా ఇలాగే పార్టీలో కొనసాగాలని చెప్పారు.



మాజీ ఎంపీకి ఆశీర్వాదం అందజేస్తున్న అర్చకులు

అమ్మవారి సన్నిధిలో మైసూర్ మాజీ ఎంపీ

వరంగల్ కల్చరల్, మార్చి 21: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని మైసూర్ మాజీ ఎంపీ సీహెచ్. విజయ్‌శంకర్ గురువారం దర్శించుకున్నారు. వరంగల్ నగరంలో ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన విజయ్‌శంకర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదం అందజేశారు. విజయ్ శంకర్ మైసూర్ నగరం ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసిన ఆయన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగు తున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందదాయకమని విజయ్‌శంకర్ అన్నారు.

సీఐని కలిసిన బీజేపీ డివిజన్ అధ్యక్షుడు

కరీమాబాద్, మార్చి21: మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యను భారతీయ జనతా పార్టీ నాయకుడు, 42వ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి అర్జున్ గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో సత్కరించి, పూలమొక్కను అందజేశారు. సీఐ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంలో, శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులకు యువత సహకరించాలని కోరారు. సీఐను కలిసిన వారిలో నాయకులు ఆరె కార్తీక్, బక్కి రంజిత్ ఉన్నారు.



సీఐని కలిసిన బీజేపి డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి అర్జున్ తదితరులు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఏసీపీ నందిరామ్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కర్నె రవీందర్

కరీమాబాద్, మార్చి 21: రోడ్డు ప్రమాదాల నివారణకు శంభునిపేట నాగమయ్య ఆర్చ్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని విశ్వనాథ్‌కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ గురువారం వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్‌ను కోరారు. గురువారం ఏసీపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నాగమయ్య ఆర్చి ఎదురుగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

తెరపైకి రోజుకో పేరు

(5వ పేజీ తరువాయి)

మద్దతుగా నిలిచినట్లుగా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు కూడా తమకు అనుకూలమైన మరికొందరి పేర్లను సూచించినట్టు సమాచారం. కానీ ఇటీవల పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ తొలుత టికెట్ ఆశించటం లేదని ప్రకటించి.. ఆ తరువాత తన మార్కు రాజకీయాలతో పోటీకి సై అంటున్నారు. ఇక దయాకర్‌కు సీఎంతో సత్సంబధాలున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ కూడా ఆయన వైపు కొంత సానుకూలంగా ఉన్నారని, దీంతో దయాకర్ పేరు ఏఐసీసీ పరిశీలనలో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రాగమళ్ల పరమేశ్వర్, బొడ్డు సునీత కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆశావాహులు ఢిల్లీలోనే మకాం వేసి కాంగ్రెస్ అగ్రనేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ టికెట్‌కు తీవ్ర పోటీ ఉండటంతో ఏఐసీసీ నేతల ఆదేశాల మేరకు సోషల్ మీడియా టీమ్‌తో పాటు సునిల్ కనుగోలు నేతృత్వంలో పలుమార్లు వరంగల్ అభ్యర్థులపై ఫ్లాష్ సర్వేలు చేపట్టారు. సర్వే రిపోర్టులతో పాటు అభ్యర్థుల ఆర్థిక, అంగ బలంపై అధిష్ఠానం దృష్టి పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి బలం, బలహీనతలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో వరంగల్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోందన్న చర్చ జరుగుతోంది.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న బృందం

గీసుగొండ, మార్చి 21: ధర్మారం జెడ్పీ పాఠశాల, గీసుగొండ జెడ్పీ పాఠశాల, వంరియపురంలోని సెంయింట్ జాన్ పాఠశాలలో నిర్వహిస్తున్న టెన్త్ పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పరీక్ష సరళిని వారు పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులను కూడా అడిగి తెలుసుకున్నారు. తనిఖీ టీం లీడర్ ఉండ్రాతి సుజన్‌తేజ, డీటీ రాజేష్‌ఖన్నా, ఏఎస్ఐ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. రమణీయం..

● కన్నుల పండువగా నరసింహుని కల్యాణోత్సవం

గీసుగొండ, మార్చి 21: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన మహిమాన్విత కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులైన స్వామివారిని, లీలాదేవి, భూదేవిలను పట్టు వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసి ఆలయ గుట్టపై నుంచి పల్లకిలో దిగువన ఉన్న కల్యాణ మండపానికి వేదమం త్రోచ్ఛారణలతో భక్తులు తోడ్కొని వచ్చారు. ఉత్సవ మూర్తులు ఆసీనులైన పల్లకిని భక్తులు మోయటానికి భక్తి పారవశ్యంతో పోటీపడి పరవశించిపోయారు. కల్యాణ మండపానికి చేరుకున్న అమ్మవార్ల, స్వామివారి తరుపున భక్తులు వేర్వేరుగా (వధూవరుల) వైపు ఉండి వేదపండితుల కల్యాణం జరిపించారు. కల్యాణ ఘడియలతో తేజోవంతమైన ఉత్సవమూర్తులను భక్తులు చూస్తూ పులకించిపోయారు. గోవిందా అంటూ స్వామి నామస్మరణలు చేస్తూ చల్లగా దీవించాలంటూ భక్తులు మొక్కుకున్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కుకున్నారు. ఎంపీపీ భీమగాని సౌజన్య ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, విష్ణు, ఈవో శేషగిరి, ఎంపీటీసీ గోపాల్, నాయకులు చాడా కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, శ్రీకాంత్, లింగారెడ్డి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 22 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

గ్రామాభివృద్ధికి సహకరించాలి



పెర్కవేడు గ్రామసభలో పాల్గొన్న అధికారులు

రాయపర్తి, మార్చి 21 : గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పెషల్ ఆఫీసర్, ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పెర్కవేడులో గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని జీపీ కాంప్లెక్స్‌లో మూడు షెటర్లకు వేలం పాట వేయగా, రూ. 1,02,220 కు గ్రామానికి చెందిన మాధవరావు, మంగిశెట్టి రాజు, కోల్కొండ రాజులు దక్కించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుని ప్రగతి పథంలో నడిచేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామ్మోహన్, ఎంపీటీసీ బండి అనూష రాజబాబు, సెక్రటరీ వెంకటేష్, కారోబార్ ఉపేందర్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



హన్మకొండలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 21 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. గురువారం మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకులు హన్మకొండలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో అరూరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త, పాత అనే తేడా లేకుండా పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని సూచించారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాల ను ప్రజలకు వివరించి మళ్లీ మూడోసారి అధికారంలోకి వచ్చేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు నాంపల్లి యాకయ్య, దీమకొండ శ్రీనివాస్, వెంకటస్వామి, యాకస్వామి, సోమిరెడ్డి, న్యాలం సాయిలు, మహంత్, హరీష్, సంపత్, కిషోర్, రాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం

నెక్కొండ, మార్చి 21 : మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చిత్రపటాలకు సంఘం సభ్యులు క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మాదాసు రవి, ఉపాధ్యక్షుడు బండి శివ, ప్రధాన కార్యదర్శి పడాల రవికుమార్, ఎడ్ల సురేందర్, నగేష్, భైరు కుమారస్వామి, అశోక్‌కుమార్, గై లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

నెక్కొండ, మార్చి 21 : వర్షాకాలం ఆరంభంలో పశువులకు సోకే గాలి కుంటు వ్యాధుల నివారణకు గాను రైతులు తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలని నెక్కొండ పశువైద్యాధికారి డాక్టర్ మమత తెలిపారు. మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో గురువారం పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాల క్యాంపును నిర్వహించారు. రైతులు ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పశు సంపదను కోల్పోయి ఆర్థికంగా నష్టాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కుమారస్వామి, గోపాల మిత్ర సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

వర్ధన్నపేట రూరల్, మార్చి 21 : ఈ నెల 22వ తేదీన పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

తెరపైకి రోజుకో పేరు

(5వ పేజీ తరువాయి)

మద్దతుగా నిలిచినట్లుగా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు కూడా తమకు అనుకూలమైన మరికొందరి పేర్లను సూచించినట్టు సమాచారం. కానీ ఇటీవల పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ తొలుత టికెట్ ఆశించటం లేదని ప్రకటించి.. ఆ తరువాత తన మార్కు రాజకీయాలతో పోటీకి సై అంటున్నారు. ఇక దయాకర్‌కు సీఎంతో సత్సంబధాలున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ కూడా ఆయన వైపు కొంత సానుకూలంగా ఉన్నారని, దీంతో దయాకర్ పేరు ఏఐసీసీ పరిశీలనలో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రాగమళ్ల పరమేశ్వర్, బొడ్డు సునీత కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆశావాహులు డిల్లీలోనే మకాం వేసి కాంగ్రెస్ అగ్రనేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ టికెట్‌కు తీవ్ర పోటీ ఉండటంతో ఏఐసీసీ నేతల ఆదేశాల మేరకు సోషల్ మీడియా టీమ్‌తో పాటు సునిల్ కనుగోలు నేతృత్వంలో పలుమార్లు వరంగల్ అభ్యర్థులపై ఫ్లాష్ సర్వేలు చేపట్టారు. సర్వే రిపోర్టులతో పాటు అభ్యర్థుల ఆర్థిక, అంగ బలంపై అధిష్ఠానం దృష్టి పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి బలం, బలహీనతలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో వరంగల్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోందన్న చర్చ జరుగుతోంది.

ఆదరణకు నోచుకోని కోనాపురం జాతర

నిలిచిన ఆలయ నిర్మాణ పనులు

గ్రామస్థులు చందాలేసుకుని నిర్వహణ



నిర్మాణంలో ఉన్న నర్సింహస్వామి ఆలయం

చెన్నారావుపేట, మార్చి 21: మండలంలోని కోనాపురంలో దేవుని గుట్టపై వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ఆదరణ లేక పోవటంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామంలో గుట్టపై వెలిసిన స్వామి వారి వేడుకలు ప్రతీ సంవత్సరం హోలి పండుగ సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల మండలాల భక్తులు, పలు తండాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లు కట్టుకొని వస్తుంటారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటారు. వందలాది భక్తులు వస్తుండడంతో ఈ జాతర కు మొదటి నుంచి గ్రామస్థులు ఎంతో ఉత్సాహంగా కమిటీలు వేసి జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర ప్రస్థావన...

కాకతీయుల కాలంలోనే నర్సింహస్వామి గుట్టపైకి గుర్రంపైన వచ్చి వెలిసినట్లు గ్రామస్థులు చెబుతుంటా రు. ఆలయం పక్కనే కొలను, స్వామి వారు నడిచిన పాదల గుర్తులు కనిపిస్తుంటాయి. గత కొద్ది సంవత్సరాల క్రితం వర్షాలు కురువక పోవటంతో గ్రామస్థులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయటంతో పంటలు, వర్షాలు సకాలంలో కురిశాయని గ్రామస్థుల నమ్మకం. అప్పటీ నుంచి గ్రామస్థులే చందాలు వేసుకొని స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గుట్ట చుట్టు మట్టి రోడ్డు నిర్మాణంతో పాటు 2019లో నూతనంగా ఆలయ నిర్మాణం కోసం రూ.3.10లక్షలతో ఇటీవల ఆలయ నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామస్థులే చందాలను వేసుకొని ఆలయాన్ని నిర్మిస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు దాతలు సిమెంటు బస్తాలను అందించారు. ప్రస్తుతం ఆలయానికి గోపుర నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గుట్టపైన దర్గా ఉత్సవాలను నిర్వహించడం విశేషం.

మూడు రోజుల పాటు జరుగనున్న జాతరకు గ్రామస్థులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు తాగు నీటికి ఇబ్బం దులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఆలయంలో గ్రానైట్‌తో ఫ్లోరింగ్ చేపట్టారు. ఈ నెల 21 రాత్రి స్వామి వారికి కల్యాణోత్సవం, అభిషేక పూజలు, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 25న హోలి పండుగ రోజున జాతర ప్రారం భమవుతుందని, ఈ నెల 29న స్వామి వారి రథోత్సవం, స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు.

గ్రామస్థులందరం కలిసి ఆలయ నిర్మాణం చేపట్టాం..

ఎడ్ల నారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్, కోనాపురం



గ్రామంలో ఆలయ నిర్మాణానికి ఓ కమిటీ వేసుకొని నర్సింహస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాం. ప్రస్తుతం గుట్టపైకి దారితో పాటు ఆలయ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆలయాన్ని అభివృద్ధి చేయటంతో పాటు భక్తులకు మరిన్ని సౌకర్యాల కోసం నిధులు మంజూరు చేయాలి. అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు, భక్తులు ఆలయ అభివృద్ధి కోసం ముందుకు రావాలి. ప్రతీ యేట భక్తుల సంఖ్య పెరుగుతుంది. ఆలయంను ఎండోమెంట్‌లోకి తీసుకోవాలి.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

గుండాల మహేందర్, మాజీ ఎంపీటీసీ, కోనాపురం



ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం సాయం అందించాలి. గ్రామస్థుల సహకారంతో ఆలయాన్ని సగం వరకే నిర్మిస్తున్నాం, గోపురం నిర్మాణానికి సుమారు రూ. 5లక్షల వరకు కావలసి ఉంది. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి నిధులు కావల్సి ఉంది. ప్రతీ సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలి. గ్రామంలోని దాతలు కూడా ముందుకు రావాలి.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

మంచినీటి బావుల మరమ్మతు

మాటులో పిచ్చిమొక్కల తొలగింపు



నర్సంపేటలోని ఫిల్టర్‌బెడ్‌ల సమీపంలోని బావిలో యంత్రంతో పూటిక తీస్తున్న దృశ్యం

నర్సంపేట, మార్చి 21 : నర్సంపేట పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మునిసిపల్ అధికారులు తాగునీ సమస్య పరిష్కారానికి గురువారం చర్యలు చేపట్టారు. పట్టణంలోని వల్లబ్ నగర్‌లోని వరమ్మతోట ప్రాంతంలోని మంచినీటి బావి, ద్వారకపేట శివారులోని మాటు వద్ద ఉన్న బావుల్లో పూటిక తీత పనులను మునిసిపల్ సిబ్బందితో ప్రారంభించారు. ఉదయం నుంచి సాయం త్రం వరకు మంచినీటి బావుల చుట్టూ పెరిగిన చెత్తాచెదారాన్ని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేసే పనులతో పాటు పూటిక తీత పనులను చేపట్టారు. పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే మాటువీరారం కాల్వలో విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్క, పుచిమొక్కలను తొలగించి కాల్వను శుభ్రం చేసే పనులను కొనసాగిస్తున్నారు. మాటువీరారం కాల్వనుంచి నీటిని సరఫరా చేసే పైపులను, విద్యుత్ మోటార్ల మరమ్మతు పనులను చురుకుగా చేపడుతున్నారు. ఫిల్టర్ బెడ్ వద్ద నీటిని ట్యాంకులు నింపడానికి ఉపయోగపడే సంపు, మోటార్ల మరమ్మతు పనులను చేపట్టారు. ఇటీవల మంచినీటి బావులు, మాటువీరారం కాల్వను, ఫిల్టర్ బెడ్‌లను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. మంచినీటి బావుల్లో పేరుకు పోయిన పూటికను తొలగించడంతో పాటు, మాటువీరారం వద్ద నీటిని నిలువ చేసే మాటులో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి వేసవిలో పట్టణ ప్రజలకు ఎలాంటి అంతరాయం రాకుండా తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించిన విషయం విదితమే. ఆయన ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసు మునిసిపల్ సిబ్బందితో మరమ్మతు పనులు. బావుల్లో పూటిక తీత పనులను చేపట్టే చర్యలు తీసుకున్నారు.

నిలిచిన దర్గా చెరువు సుందరీకరణ పనులు

ఇబ్బందులు పడుతున్న భక్తులు, గ్రామస్థులు

త్వరగా పూర్తిచేయాలని డిమాండ్



వెడల్పు చేసిన చెరువుకట్ట (ఇన్‌సెట్‌లో) రివిట్‌మెంట్ లేకుండా ఉన్న దిగువ భాగం

పర్వతగిరి, మార్చి 21 : శ్యామా ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం ద్వారా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారంషరీఫ్ దర్గా చెరువు సుందరీకరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి గాను రూ.1.50 కోట్ల నిధులను ప్రతి పాదించింది. చెరువుకట్టను వెడల్పు చేసి సుందరీకరణ పనుల్లో భాగంగా కట్టపై పచ్చని చెట్లు, పచ్చనిగడ్డి, బెంచీలతో పాటు కట్ట పొడవునా సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలి.చెరువుకట్టను మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా తీర్చిదిద్దాలి. దీనికి గాను పనులను చేపట్టే సమయంలో చెరువులో ఉన్న నీటినంతా కిందకు వదిలేశారు. దీంతో అన్నదాతలు ఒక పంటను కోల్పోవాల్సి వచ్చింది. పనులను ప్రారంభించి రెండేళ్లు దాటుతున్నా నేటికీ పూర్తికాలేదు.

కోతకు గురవుతున్న చెరువుకట్ట

చెరువుకట్టను 600 మీటర్ల మేర వెడల్పు చేయాల్సి ఉండగా గతేడాది ఏప్రిల్‌లో పనులను ప్రారంభించారు. దీనికి గాను చెరువులో ఉన్న నీటినంతా కిందకు వదిలేయడంతో రైతులు తమ పంటలకు సాగునీరు లేక పంట కోల్పోయారు. అనంతరం పనులను చేపట్టగా చెరువులో నుంచి మట్టిని తోడి కట్టను వెడల్పు చేశారు. కేవలం కట్ట మాత్రమే వెడల్పుచేసి దానికి రాళ్లతో రివిట్‌మెంట్ ఏర్పాటుచేయకపోవడంతో మట్టి కోతకు గురవుతోంది. చెరువుకట్టను వెడల్పుచేసిన గుత్తేదారు, అధికారులు ఇక అంతటితో పనులను ఆపివేశారు. మిగతా పనులను చేపట్టకపోవడంతో భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

వేసవిలో పెరగనున్న భక్తులు

అన్నారం గ్రామంలో యాకూబ్ షావళి దర్గా ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు కులమతాలకతీతంగా తరలివస్తుంటారు. ఇక్కడకు వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో ఒక రోజు నిద్ర చేస్తుంటారు. అనంతరం తెల్లవారి కందూర్లు చేసి దర్శనం చేసుకుంటారు. కాగా, ప్రతీ ఏటా వేసవి కాలంలో దర్గాకు భక్తుల రాక పెరుగుతుంది. చెరువు కట్ట వెడల్పు చేసిన అధికారులు మిగతా పనులను పెండింగ్‌లో పెట్టడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెడల్పు చేసి చెరువుకట్టపై దర్గాకు వచ్చిన భక్తుల వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో అటు గ్రామస్థులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలని డిమాండ్

రూర్బన్ పథకంలో భాగంగా చేపట్టే పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో చేపడతారు. గత ప్రభుత్వం పనులను ప్రారంభించగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పూర్తి చేస్తుందా.. లేదా..? అనే ఆందోళనలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పనులను మధ్యలోనే నిలిపివేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకుని పనులను పూర్తిచేయాలని పలువురు డిమాండ్‌చేస్తున్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



ఎమ్మెల్యే నాగరాజును కలిసిన ఇల్లంద మండల కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 21 : పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. గురువారం హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పోశాల వెంకన్న, ఎద్దు సత్యనారాయణ ఎమ్మెల్యేను, నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ పరిస్థితులపై వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా చూడాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిచేయడమే లక్ష్యంగాపనిచేస్తున్నట్లు తెలిపారు. కొత్త పాత తేడా లేకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు.

రూ.50వేలకు మించి తీసుకెళ్లొద్దు

వర్ధన్నపేట రూరల్, మార్చి 21 : వివిధ ప్రాంతాలకు వ్యక్తిగత పనుల మీద, వ్యాపారాల పనిమీద ప్రయాణించే వారు రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకుని ప్రయాణించవద్దని వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని డీసీ తండా వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతీ ఒక్కరు నిబంధనలను పాటించాలని కోరారు. ప్రజలు సైతం ఎన్నికల కోడ్ రీత్యా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఎస్ఎస్‌టీ టీం సభ్యులు పాల్గొన్నారు.

నేడు అంగడి వేలం

పర్వతగిరి, మార్చి 21 : మండల కేంద్రంలోని అంగడి (వారాంతపు సంత), షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలం పాటలను నిర్వహించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి రఘు తెలిపారు. గురువారం వారు విలేఖరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను నిర్వహించే అంగడి వేలంలో పాల్గొనేవారు రూ.50వేలు ముందస్తుగా డిపాజిట్ చేయాలని అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ 20గదులకు గాను వేలంలో పాల్గొనే వారు రూ.25 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 21 : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో,ఐకేపీ కార్యాలయంలో వేరువేరుగా ఏర్పాటు చేసిన ఎస్వీఈఈపీ-2024 అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగావేసి వారి కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ధనలక్ష్మి, ఎంఈవో నోముల రంగయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నర్సంపేట, మార్చి 21 : పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం చట్టాలపై అవగాహన సదస్సును ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది సునీత మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమకు రక్షణగా నిలిచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాచార హక్కు చట్టం, విద్యాహక్కుచట్టం, బాల్యవివాహాల చట్టం, మహిళల అ క్రమరవాణా చట్టం, వరకట్న చట్టం, నిర్భయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గోగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పెండెం రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క పూట బడులు నడపాలి

దుగ్గొండి, మార్చి 21: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలల లాగనే ఒక్కపూట నిర్వహించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ పాఠశాలలు రెండు పూటలు నడుపుస్తున్నట్లు తేలిందని, వేసవి కాలం దృష్ట్యా ఒక్క పూట నడిచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ ఉష్ణోగ్రతతో విద్యార్థులు అస్వస్థకు గురయే ప్రమాదం ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

బ్యాంకు సేవలను విస్తరింపజేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

వర్ధన్నపేటరూరల్, మార్చి 21: డీసీసీబీ బ్యాంకు సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత ఎక్కువగా అందేలా విస్తరింపచేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. గురువారం సాయంత్రం డీసీసీబీ బ్యాంకును సందర్శించి, బ్యాంకు అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తీసుకున్న రుణాలను అధికారులు రికవరీ చేసేలా చూడాలన్నారు. ప్రజలు సైతం తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం కురువా నాయక్, బ్రాంచ్ మేనేజర్ సమత, ఐనవోలు మేనేజర్ శ్రావణ్, సొసైటీ సీఈవోలు, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాంధాన్ తండాలో వైద్య శిబిరం

వర్ధన్నపేట రూరల్, మార్చి 21 : మండలంలోని రాంధాన్ తండాలో గురువారం రాయపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్యశ్రీ ఆధ్వర్యంలో జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న 192 మందికి వైద్య పరీక్షలుచేసి మందులను పంపిణీచేశారు. వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలన్నారు. వ్యవసాయ పనులు ఉదయాన్నే పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజు, ప్రేమ్ ప్రసాద్, ప్రణీత, లత, ఆమని పాల్గొన్నారు.

దారులు అస్తవ్యస్తం.. రాకపోకలకు కష్టం

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కంకరపోసి వదిలేసిన భద్రుతండా రోడ్డు

ఖానాపురం, మార్చి 21 :ప్రజల రాకపోకలు సాగించేందుకు సర్కారు రోడ్ల నిర్మాణం చేపడుతున్నా, నిర్వాహణ కొరవడటంతో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఖానాపురం మండంలో ఈ దుస్థితి నెలకొంది. మండల కేంద్రం నుండి రాగంపేట, కొత్తూరు, రంగాపురం వెళ్లే రోడ్డు, ఖానాపురం నుంచి పెద్దమ్మగడ్డ మీదుగా మనుబోతులగడ్డ, బండ మీదిమామిడితండాకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడూ రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గాల్లో రోడ్లు ధ్వంసమై కంకర తేలి, గుంతలు పడి అధ్వాన్నంగా తయారయ్యాయి. దీంతో ఆ దారుల్లో ప్రయాణించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ద్విచక్రవాహనదారులు తరుచూ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో రాగంపేటకు చెందిన యువకుడు వికాస్ రాత్రి వేళలో ఈ గుంతల రోడ్డు మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, వాహనం రోడ్డుపై ఉన్న గుంతలో పడటంతో తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్సకై రూ.4లక్షలు ఖర్చుపెడితేనే కోలుకున్నాడు. ఇలాంటి ప్రమాదాలు తరుచూ ఈ మార్గంలో జరుగుతున్నాయని, రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

కంకరపోశారు.. వదిలేశారు...

మండలంలోని మంగళవారిపేట నుంచి భద్రుతండా మీదుగా మర్సాయిబోడు తండావరకు 4కిలో మీటర్లకు గత ప్రభుత్వ హయాంలో రూ.2కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి అసెంబ్లీ ఎన్నికల ముందు పనులు ప్రారంభించి ఆదిలోనే అసంపూర్తిగా వదిలేశారు. మట్టి రోడ్డును తవ్వి కంకర పరిచి వదిలేశారు. ఎన్నికలు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా పనుల్లో కదలిక లేదు. అసంపూర్తిగా వదిలేసిన రోడ్డుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో ఎగిసి పడుతున్న దుమ్ముతో పాటు ద్విచక్ర వాహనాలు స్కిడ్ కావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

పంటలపై ప్రభావం...

ప్రజలు నిత్యం ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కంకర. డస్ట్ వేసి వదిలేయడంతో వాహనాల రాకపోకలకు దుమ్మలేచి వెనకాలవచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. లేచిన దుమ్ము రోడ్డు కిరువైపుల ఉన్న పంటలపై పడడంతో మొక్కలు అభివృద్ధి చెందడంలేదని, దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు రోడ్డుకు నీరు సైతం పట్టడంలేదని వాపోతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

తొందరగా పనులు పూర్తి చేయాలి

మూడు బాలక్రిష్ణ, భద్రుతండా



బీటీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డును తవ్వి కంకరపోసి వదిలివేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. కంకర తేలడంతో బైక్‌పై పోయేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. కంకరపై నడుపుతుంటే వాహనాలు పాడవుతున్నాయి. దుమ్ములేచి ఇబ్బందికరంగా ఉంటోంది. తారుపోసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

రాత్రి వేళల్లో వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది

అజ్మీర రాజు, కొత్తూరు



ఖానాపురం నుంచి రంగాపురం వెళ్లేదారి గుంతలమయంగా ఉండటంతో తరు చూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలపై వెళ్లాలంటే తీవ్రఇబ్బందిగా ఉంది. పెద్ద గుంతలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.